www.kalamjyothi.com


కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

గురువారం
22.10.2026



- 19 రోజుల్లో రూ.2,054 కోట్లు
- గతేడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి
- బీర్ల విక్రయాల్లో 41 శాతం పైగా హైక్
- 30.37 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు
- 18.38 లక్షల కేసులకు చేరిన ఐఎమ్ఎఫ్ఎల్ విక్రయాలు
- అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల వ్యాపారం
- దసరా వేళ కాసుల వర్షం కురిపించిన లిక్కర్ మార్కెట్
- ఎక్సైజ్ శాఖ అధికారిక గణాంకాలు వెల్లడి



పొట్టుపొట్టు తాగేందు!

ఖజానా నింపిండు!

దసరా పండుగ వేళ తెలంగాణలో మద్యం ఏరులై పారింది. పండగ సంబరాల్లో మునిగితేలిన మందుబాబులు ఖజానాపై కాసుల వర్షం కురిపించడంతో కేవలం 19 రోజుల్లోనే ఏకంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గతేడాదితో పోలిస్తే ఏకంగా 37 శాతం వృద్ధి నమోదు కాగా, సాధారణ లిక్కర్ కంటే బీర్ల విక్రయాలు 41 శాతానికి పైగా పెరిగి మార్కెట్‌లో సరికొత్త రికార్డు సృష్టించాయి. రెండో వారం నుంచి ఊపందుకున్న కొనుగోళ్లతో అక్టోబర్ 19న ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.303.40 కోట్ల విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడించాయి. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే రూ.500 కోట్లకు పైగా వ్యాపారం జరిగి ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది.

- కలంజ్యోతి బ్యూరో

2లో..

దసరా వేడుకల్లో నేతల ఆత్మీయ కలయిక



రాజకీయాలకు అతీతంగా శుభాకాంక్షలు

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన దసరా ఉత్సవాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఆత్మీయంగా కలుసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా పండుగ వేళ ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అనంతరం మినీ ట్యాంక్ వద్దకు వచ్చిన ప్రజలతో కలిసి ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



హైదరాబాద్-విజయవాడ

హైవేపై ట్రాఫిక్

- పంతంగి టోల్‌ప్లాజా వద్ద నెమ్మదిగా కదిలిన వాహనాలు
- ముగిసిన దసరా సెలవులు..
- నగరానికి తిరుగు ప్రయాణం
- 12 బూత్‌లు తెరిచి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

2లో..

దసరా పండుగ సెలవులు ముగియడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి నగరవాసులు ఒకేసారి తిరుగు ప్రయాణం కావడంతో హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. పంతంగి టోల్‌ప్లాజా వద్ద టోల్ బూత్‌లు కిక్కిరిసిపోయి వాహనాలు నత్తనడకన సాగుతుండటంతో పాటు, చౌటుప్పల్ పరిసరాల్లో నిర్మాణ పనులు తోడవ్వడంతో మహిళలు, పిల్లలతో ప్రయాణిస్తున్న కుటుంబాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- కలంజ్యోతి బ్యూరో



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
గురువారం 22.10.2026
www.kalamjyothi.com

పొట్టుపొట్టు తాగిండ్రు!



కలంజ్యోతి బ్యూరో, హైదరాబాద్ (అక్టోబర్ 21) : దసరా పండుగ సీజన్ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా మద్యం అమ్మకాలు సరి కొత్త రికార్డులను సృష్టించాయి. పండుగ సంబ రాల్లో మునిగితేలిన ప్రజలు మద్యం కొనుగోళ్లకు భారీగా ఎగబడ్డారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కేవలం 19 రోజుల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ము డుపోయినట్లు ఎక్సైజ్ శాఖ అధికారిక గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే మద్యం విక్రయాల్లో ఊహించని రీతిలో 37.02 శాతం భారీ వృద్ధి నమోదైంది. పండుగ రోజుల్లో గ్రామాలు, నగరాలు అనే తేడా లేకుండా మద్యం ప్రియులు వైన్ షాపుల ముందు బారులు తీరారు. ప్రత్యేకించి ఈ పండుగ సీజన్‌లో సాధారణ లిక్కర్ కంటే బీర్లకు అనూహ్యమైన డిమాండ్ ఏర్పడటం ఎక్సైజ్ అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది.

బీర్ల విక్రయాల్లో సరికొత్త రికార్డు..

ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎమ్ఎఫ్ఎల్) విక్రయాలతో పోలిస్తే బీర్ల అమ్మకా లు అత్యంత వేగంగా పుంజుకున్నాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈ ఏడాది ఆ సంఖ్య ఏకంగా 30.37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా గణనీయమైన వృద్ధి నమోదై మార్కె ట్‌లో సరికొత్త ట్రెండ్‌ను సృష్టించింది.

పెరిగిన ఐఎమ్ఎఫ్ఎల్ అమ్మకాలు..

బీర్లతో పాటు ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎమ్ఎఫ్ఎల్) అమ్మకాలు కూడా గతేడాది కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. గత ఏడాది ఇదే 19 రోజుల కాలంలో 14.16 లక్షల కేసుల ఐఎమ్ఎఫ్ఎల్ మద్యం అమ్ముడవగా, ఈసారి అది 18.38 లక్షల కేసులకు పెరిగింది. పండుగ వాతావరణం, విందులు వినోదాలు ఎక్కువగా ఉండటంతో మద్యం వినియోగం ఊపందుకుంది.

2వ వారం నుంచే..

పండుగ సీజన్ ప్రారంభమైన మొదటి వారంలో అమ్మకాలు కొంత నెమ్మదిగానే సాగినప్పటికీ, రెండో వారం మొదలైన దగ్గర నుంచి వ్యాపారం అనూహ్యంగా పుంజుకుంది. అక్టోబర్ 16వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం విక్రయాల విలువ రూ.1,527.85 కోట్లుగా నమోదైంది. ఆ తర్వాత పండుగ రోజులు దగ్గరపడటంతో కొనుగోళ్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి.

3 రోజుల్లోనే రూ.500 కోట్లకు పైగా..

అక్టోబర్ 16 తర్వాత కేవలం మూడు రోజుల వ్యవధిలోనే విక్రయాలు రూ.2,000 కోట్ల మార్కును దాటేశాయి. అక్టోబర్ 19 నాటికి మొత్తం అమ్మకాలు రూ.2,054.51 కోట్లకు చేరుకున్నాయి. అంటే కేవలం 72 గంటల వ్యవధిలోనే రూ.526 కోట్లకు పైగా విలువైన మద్యం అమ్ముడై ప్రభుత్వ ఖజానాకు భారీగా రాబడిని తెచ్చిపెట్టింది.

ఒక్కరోజే రూ.303 కోట్ల ఆదాయం..

పండుగ రద్దీ తారాస్థాయికి చేరిన అక్టోబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో విక్రయాలు జరిగాయి. ఆ ఒక్క రోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోవడం విశేషం. అక్టోబర్ 19 వరకు నమోదైన అధికారిక విక్రయాల ఆధారంగా ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. నెలాఖరు వరకు అమ్మకాలు పరిశీలిస్తే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం





- ఘనంగా పోలీస్ సంస్మరణ దినోత్సవం
- ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జి. పాటిల్

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 22) : దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ జాతీయ జెండాను ఎగురవేసి అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా దళాల దాడిలో పదిమంది పోలీస్ జవాన్లు అమరులయ్యారని, వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గుర్తుచేశారు.

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం..

1993 నవంబర్ 14న సోమశిలలో మావోయిస్టుల దాడిలో అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ పరదేశి నాయుడు ఐపీఎస్‌తో పాటు ఎస్సైలు కిషోర్ కుమార్, శివప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ రంగారెడ్డి, కానిస్టేబుళ్లు ఎన్.ప్రసాద్, సుభాన్, జహీర్ ఇక్బాల్, జయరాములు, షేక్ హైదర్ అమరులైన ఘటనను ఎస్పీ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వద్ద వారి కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు చిన్ను నాయక్, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





హైదరాబాద్-విజయవాడ
హైవేపై ట్రాఫిక్

కలంజ్యోతి, చౌటుప్పల్ (అక్టోబర్ 21) : దసరా పండుగ సెలవులు ముగియడంతో నగరవాసులు తిరుగు ప్రయాణం పట్టారు. దీంతో హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి (NH65) వాహనాలతో కిక్కిరిసిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరడంతో టోల్‌గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

బారులు తీరిన వాహనాలు..

ముఖ్యంగా హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు పెద్ద సంఖ్యలో బారులు తీరాయి. కొన్ని సమయాల్లో అర కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. రద్దీని తగ్గించేందుకు అధికారులు హైదరాబాద్ వైపు ఉన్న 18 టోల్ బూత్‌లకు గాను 12 తెరిచి వాహనాలను పంపించారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉన్నప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

రహదారి నిర్మాణ పనులతో మరింత అంతరాయం..

దీనికి తోడు చిట్యాల, చౌటుప్పల్ వద్ద జరుగుతున్న అండర్‌పాస్, వంతెన నిర్మాణ పనులు వాహనాల రాకపోకల వేగానికి తీవ్ర అడ్డంకిగా మారాయి. అక్టోబర్ 22 నుంచి పాఠశాలలు, కళాశాలలు తిరిగి ప్రారంభం కానుండటంతో కుటుంబసభ్యులు, ఉద్యోగులు ఒకేసారి రోడ్డెక్కడం రద్దీకి ప్రధాన కారణంగా మారింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు టోల్ ప్లాజా సిబ్బందితో పాటు పోలీసులు, హైవే సిబ్బంది రంగంలోకి దిగారు.

పోలీసుల సూచనలు పాటించాలంటూ విజ్ఞప్తి..

అదనపు సిబ్బందిని నియమించి ఫాస్టాగ్ ప్రాసెసింగ్‌ను వేగవంతం చేశారు. కీలక కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఉండి వాహనాలను క్రమబద్ధీకరించారు. పండుగకు వెళ్లే సమయంలో అక్టోబర్ 17న 24 గంటల వ్యవధిలో ఈ టోల్‌ప్లాజా నుంచి సుమారు 52,000 వాహనాలు వెళ్లగా, తిరుగు ప్రయాణంలోనూ నిమిషానికి సగటున 36 వాహనాల చొప్పున రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి వరకు రద్దీ కొనసాగే అవకాశం ఉన్నందున ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



మొబైల్ డెంటల్ క్లినిక్ ప్రారంభం

ప్రజలకు అందుబాటులో మెరుగైన దంత వైద్యం

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 22) : కూచుకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ డెంటల్ క్లినిక్ వాహనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముందుగా వాహనాలకు శాస్త్రోక్తంగా ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేసి మొబైల్ డెంటల్ క్లినిక్ వాహనాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలు మరింత చేరువ కావాలనే సదుద్దేశంతో ఈ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలందరూ ఈ మొబైల్ డెంటల్ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

గురువారం 22.10.2026

www.kalamjyothi.com





అమరుల త్యాగాలు చిరస్మరణీయం

ఎస్పీ జానకి షర్మిల

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 21) : పోలీసు అమర వీరుల త్యాగం చిరస్మరణీయమని , వారి త్యాగాలు, సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అమర వీరుల స్మారక స్థూపం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి, అమర వీరులకు ఘన నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ మాట్లాడుతూ సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని రక్షిస్తే, రాష్ట్రంలో అంతర్గత భద్రతను కాపాడుతూ ప్రజలకు భరోసా కల్పించేది పోలీసులన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణలో పోలీసులు అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. లడఖ్ సరిహద్దులో చైనా సైనికులతో పోరాడుతూ ప్రాణాలర్పించిన సీఆర్పీఎఫ్ జవాన్ల త్యాగానికి గుర్తుగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి కుటుంబాలకు అండగా నిలవడం, వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఖైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అధర్మంపై ధర్మ విజయానికి ప్రతీక విజయదశమి

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

కలంజ్యోతి, నిర్మల్(అక్టోబర్ 21) : బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ దేవీ నవరాత్రులు, అమ్మవారి పూజల విశిష్టతను ప్రస్తావిస్తూ, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పురాణాల్లో సైతం విజయ దశమికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పండుగ వారసత్వాన్నిభావితరాలకుసంప్రదాయబద్ధంగా అందించాలని అన్నారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వాలు అండగా నిలవాలని, ఈ విషయంలో భారతీయ జనతా పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సనాతన ధర్మం అందరినీ కలుపుకొనిపోయే ధర్మమని పేర్కొన్నారు. తరాలుగా హిందూ ధర్మం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు, మన సంప్రదాయాల పునరుజ్జీవనానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో అస్థిరత సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపిస్తూ, దేశ ఐక్యతను, సంస్కృతిని, ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో ఘనంగా దసరా

భక్తిశ్రద్ధలతో శమీ పూజలు, వేణుగోపాలస్వామి గరుడోత్సవం





కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 21) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో విజయదశమి పండుగ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య అత్యంత ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు సంప్రదాయబద్ధంగా శమీ పూజలు నిర్వహించి, కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేస్తూ దసరా పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ప్రజలు పాలపిట్టను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడంతో పాటు ఒకరికొకరు జమ్మి ఆకులను బంగారంగా పంచుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి గరుడోత్సవం భక్తుల కోలాహలం నడుమ వైభవంగా సాగింది. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో పోలీసులు సంప్రదాయబద్ధంగా ఆయుధ పూజ నిర్వహించి, విధి నిర్వహణలో ప్రజలకు ఎల్లప్పుడూ రక్షణ కల్పించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు, ఉప సర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సింగల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బండారి బాల్ రెడ్డి, మీసం రాజం, గుండాడి వెంకట్ రెడ్డి, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, సందుపట్ల లక్ష్మారెడ్డి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పాల్గొనగా, గ్రామం పురోహితులు రాచర్ల దయానంద శర్మ, రాచర్ల హనుమాన్ల శర్మ, ఆలయ పురోహితులు బీట్మూరి గోపాలచార్యులు, నవీన్ చార్యులు వేదాశీర్వచనాలు అందజేశారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్, ఎస్సై రమేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించడంతో మండలవ్యాప్తంగా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.



ప్రభుత్వం మౌనం వీడాలి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలి

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 21) : ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. కరీ పండుగ రోజున కూడా ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన కొనసాగించారు. ఇందులో భాగంగా మౌనదీక్ష చేపట్టి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన సమయంలో గొడ్డుకారంతో భోజనం చేస్తూ ప్రభుత్వం స్పందించకపోతే కారంమెతుకులే దిక్కంటూ తమ తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. ప్రజలంతా పండుగ సంబరాల్లో ఉంటే, ఉద్యోగులు మాత్రం రోడ్డున పడి ఆందోళన చెందాల్సి వస్తోందని వాపోయారు.

గొడ్డుకారంతో తింటూ ఆవేదన..

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇకనైనా మౌనం వీడి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, డాక్టర్ రాజు, డాక్టర్ అక్బర్, డాక్టర్ యూసుఫ్ నవీద్, డాక్టర్ ఉమేరా, డాక్టర్ సురేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు రజియా, చంద్రకళ, వనజతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



'సహాయ' రాజిరెడ్డికి అశ్రునివాళి

కన్నీటి వీడ్కోలు పలికిన 95-96 మిత్రబృందం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 21) : గత ఇరవై ఏళ్లుగా దసరా మరుసటి రోజున ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ, 'సహాయ ఫౌండేషన్' ద్వారా సమాజ సేవలో భాగస్వామ్యమైన తోటి మిత్రుడు సందుపట్ల రాజిరెడ్డి అకాల మరణం తీరని శూన్యాన్ని మిగిల్చిందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో 199596 ఎస్ఎస్సి పూర్వ విద్యార్థులు, సహాయ ఫౌండేషన్ సభ్యులు పాల్గొని రాజిరెడ్డి చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి, రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా అశ్రునివాళులర్పించారు. స్కూల్ రోజుల నాటి బంధాన్ని ఫౌండేషన్ రూపంలో సమాజ హితానికి మలిచిన ప్రయాణంలో రాజిరెడ్డి తోడ్పాటు ఎంతో అమూల్యమైనదని గుర్తుచేసుకున్నారు. ఆయన భౌతికంగా దూరమైనా జ్ఞాపకాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని పేర్కొంటూ, రాజిరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని పూర్వ విద్యార్థులు, ఫౌండేషన్ ప్రతినిధులు ముక్తకంఠంతో ప్రార్థించారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
గురువారం 22.10.2026
www.kalamjyothi.com



అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

పోలీస్ సంస్మరణ దినాన ఎస్పీ మహేష్ బి. గితే నివాళి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 21) : ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పుష్ప గుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

సాయుధ పోలీసులు సంప్రదాయబద్ధంగా శోక శస్త్ర నిర్వహించగా, రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా



విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసు అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల త్యాగాల జ్ఞాపకార్థం ఏటా ఈ సంస్మరణ దినాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. అంతర్గత భద్రత పరిరక్షణలో జిల్లాలో ఎనిమిది మందికి పైగా పోలీసులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు.

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం..

కార్యక్రమానికి హాజరైన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, వారికి జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ నెల 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు..

పోలీసు అమరవీరుల త్యాగాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు, క్యాండిల్ ర్యాలీలు, రన్, ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన

కలంజ్యోతి, నిర్మల్(అక్టోబర్ 21) : నిర్మల్ జిల్లా కొట్ల సిద్ధాపూర్ ల మధ్య నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టోకెన్లు పొందిన లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. రూ.31.80 కోట్ల అంచనా వ్యయంతో 600 కుటుంబాల కోసం 25 బ్లాకుల్లో నిర్మించిన డబుల్ ఇళ్లను ఇప్పటివరకు లబ్ధిదారులకు కేటాయించకపోవటం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులను గుర్తించి టోకెన్లు కూడా ఇచ్చారని వారు తెలిపారు. ఇప్పటికీ ఇవ్వకపోగా దసరా లోపు ఇస్తామన్న కలెక్టర్ హామీ కార్యరూపం దాల్చలేదన్నారు. అర్హులను గుర్తించి వెంటనే ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.



దేవి నవరాత్రుల్లో సర్పంచ్ లక్ష్మికృష్ణ

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 21) : సాదులనగర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన దుర్గాభవాని మాత దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాదులనగర్ సర్పంచ్ లక్ష్మి కృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడుతూ.. జగన్మాత అయిన దుర్గాభవాని అమ్మవారు గ్రామ ప్రజలందరినీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో చల్లగా కాపాడాలని కోరుకున్నట్లు తెలిపారు. అమ్మవారి నవరాత్రులు నేటితో 11వ రోజుకు చేరుకోవడంతో భవానీ భక్తులు, శివసత్తుల పూనకాలు, ఆటపాటలు, భజనలు, డప్పుచప్పుళ్లు, శివసత్తుల చిందుల మధ్య గ్రామ పురవీధుల్లో ఊరేగించిన అనంతరం దుర్గామాత విగ్రహాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భవానీ భక్తులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డా.స్వామికి అమ్మవారి చిత్రపటం బహూకరణ

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 21) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో దుర్గాభవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా నిత్య పూజలు అందుకున్న అమ్మవారి నిమజ్జనం వేళ, యూత్ ప్రతినిధులు స్థానిక అశ్విని హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ స్వామిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దుర్గామాత చిత్రపటాన్ని బహూకరించి, అమ్మవారి పవిత్ర ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాభవాని యూత్ సభ్యులు పడ్డాల భాస్కర్, నంది నరేష్, జవాజి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.





మృతురాలి కుటుంబానికి పరామర్శ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 21) : చెన్నారావుపేట మండలంలోని అక్కల్ చెడ కట్టయ్య పెళ్లి గ్రామానికి చెందిన మరాఠి కొమురమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ గ్రామానికి చేరుకుని, స్థానిక సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్‌తో కలిసి ఆమె స్వగృహంలో పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారుడు, కాంగ్రెస్ కార్యకర్త మరాఠి రవిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, ఉప సర్పంచ్ కక్కెర్ల రజిత శ్రీను, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, మాజీ ఉప సర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లావుడ్యా వెంకన్న, నాయకులు గంట వీరన్న, మంకు కర్ణాకర్ రెడ్డి, బొంత సురేష్, కోరే శ్రీను, ముత్యం చేరాలు, వార్డు సభ్యులు ఒంటరి రాజు, బాధవత్ సురేష్, కరెడ్ల శివ, బానోత్ శ్రీను, బాధవత్ రవి, రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కులం పేరుతో దూషించారంటూ పోలీసులకు ఫిర్యాదు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 21) : చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో దసరా పండుగ వేళ దళితులపై దాడి చేసి కులం పేరుతో దూషించారని ఆరోపిస్తూ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. గ్రామంలో కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం దసరా రోజున దళితులు డప్పు చప్పుళ్లతో పెద్దమనుషుల ఇళ్లకు వెళ్లి ఆహ్వానిస్తుంటారని, ఈ క్రమంలో చింతకింది అశోక్‌ను తీసుకురావడానికి వెళ్తుండగా కొందరు వ్యక్తులు తమను అడ్డుకుని దూషిస్తూ దాడికి పాల్పడ్డారని బాధితులు వాపోయారు. ఈ దాడిలో బొమ్మెర కొమ్మాలు, నవీండ్ల మల్లయ్య, ఎల్దొండ మల్లయ్య, పులి సాంబయ్య తదితరులు గాయపడ్డారని తెలిపారు. గతంలోనూ గ్రామంలో పలుమార్లు దళితులపై బెదిరింపులు, భౌతిక దాడులు, కులవివక్ష ఘటనలు జరిగాయని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కఠిన చర్యలు తీసుకుని బాధితులకు తగిన రక్షణ కల్పించాలని పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మెర కొమ్మాలు, నవీండ్ల మల్లయ్య, ఎల్దొండ మల్లయ్య, పులి సారయ్య, చిలపాక రవి, బొమ్మెర నరేందర్, పెద్ద యాకయ్య, వీరేశం, స్వామి, రాజు, ప్రవీణ్, బన్నీ, పవన్, సుమన్, వేణు, మధుకర్, రవీందర్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



చెన్నారావుపేటలో క్రికెట్ సందడి

ఉత్సాహంగా సాగిన మండల స్థాయి పోటీలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 21) : చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ స్కూల్ మైదానంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు పురస్కారాలను అందజేశారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో చెన్నారావుపేట 11 థండర్స్ జట్టు విజేతగా నిలిచి కంది కృష్ణ చైతన్య రెడ్డి స్పాన్సర్ చేసిన ₹10,000 మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన ఉప్పరపల్లి జట్టుకు కంది గోపాల్ రెడ్డి స్పాన్సర్ చేసిన ₹5,000 రెండో బహుమతి లభించింది.

గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకే క్రీడలు..

గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని కంది కృష్ణ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. ఆటలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, వర్ధమాన క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు. విజేత చెన్నారావుపేట 11 థండర్స్ జట్టుతో పాటు రన్నరప్ ఉప్పరపల్లి జట్టును నిర్వాహకులు, అభిమానులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లక్క రాజు, ఉప్పునూతల రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
గురువారం 22.10.2026
www.kalamjyothi.com

108 అంబులెన్స్ లో సురక్షిత ప్రసవం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 21) : గర్భిణికి మార్గమధ్యలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి వాహనంలోనే సురక్షితంగా ప్రసవం చేశారు. గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నస్రీన్ అనే గర్భిణికి మంగళవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు (ఈఎంటీ) చెలిమెల సాయికృష్ణ, పైలట్ మనోజ్ కుమార్ ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో నొప్పులు మరింత ఎక్కువ కావడంతో పరిస్థితిని గమనించిన సిబ్బంది అప్రమత్తమై అంబులెన్స్‌లోనే చాకచక్యంగా ప్రసవం చేయగా, షేక్ నస్రీన్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు నిర్ధారించిన అనంతరం వారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



అత్యవసర సమయంలో వెనువెంటనే స్పందించి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడిన ఈఎంటీ చెలిమెల సాయికృష్ణ, పైలట్ మనోజ్ కుమార్‌లను గర్భిణి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.



ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

సిద్దేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 21) : చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్దేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారి శోభాయాత్రను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రావికోటి మఠం భిక్షమయ్య శాస్త్రి, సాయి శాస్త్రి, గణేష్ శాస్త్రి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమార్చనలు జరిపి, త్రిశూల హారతులు సమర్పించి భక్తితో ప్రార్థించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలతో దుర్గామా త శోభాయాత్రను వైభవంగా ప్రారంభించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భజనలు, కోలాటాలు, భక్తుల జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో పునీతమయ్యాయి.





రైల్వే విద్యుత్ లైన్‌పై వ్యక్తి హల్‌చల్..

కలంజ్యోతి, నెక్కొండ (అక్టోబర్ 21) : వరంగల్ జిల్లా నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైల్వే విద్యుత్ లైన్‌పైకి ఎక్కి హల్‌చల్ చేయడం తీవ్ర కలకలం రేపింది. తన భార్యతో మాట్లాడించాలని, లేదంటే పైనుంచి దూకేస్తానంటూ సదరు వ్యక్తి విద్యుత్ స్తంభంపై కూర్చొని హంగామా చేశాడు. సమాచారం అందుకున్న వెంటనే నెక్కొండ ఎస్సై శ్రావణ్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యుత్ లైన్‌పై ఉన్న వ్యక్తికి నచ్చజెప్పి, ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా సురక్షితంగా కిందకు దించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ఈ అనూహ్య ఘటనతో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఉత్కంఠకు గురయ్యారు.



బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 21) : నర్సంపేట రూరల్ మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు మర్ద లక్ష్మీనర్సు (చిన్న) ఇటీవల అకాల మరణం చెందడంతో గురిజాల గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతో పాటు తక్షణ సహాయంగా 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నపెల్లి నరసింహం, మాజీ ఎంపీటీసీ బండారి శ్రీలత రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ మోటురి రవి, బండారు చిన్న వెంకటేశ్వర్లు, అన్న రాజమల్లు, గడ్డం కొమురయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అల్లి రవి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్రి కుమారస్వామి, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంచిక హరీష్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి సంగెం శ్రీకాంత్, వార్డు సభ్యులు గజ్జి రాము, బండారి మల్లయ్య, మంచిక దేవేందర్, ముదురు రమేష్, యశోద నరసింగం, మర్ద నవీన్, దుడల ప్రకాష్, యశోద హరీష్, సామల సతీష్, మాటూరి రవీంద్ర చారి, గట్టు సంపత్, ఆరే సుధాకర్, డ్యాక కుమారస్వామి, మర్ద కుమారస్వామి పాల్గొన్నారు.

ఘనంగా దసరా సంబురాలు

పల్లెల్లో వెల్లివిరిసిన సంప్రదాయాలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 21) : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి సంబరాలు చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో అంబరాన్నంటాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామగ్రామాన ప్రజలు నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవతలతో పాటు బొడ్రాయి వద్ద శాస్త్రోక్తంగా పూజలు చేసి, అనంతరం జమ్మి చెట్టు వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో శమీపూజలు ఆచరించారు. జమ్మి ఆకులను బంగారంగా భావిస్తూ కుటుంబ సభ్యులు, పెద్దలకు సమర్పించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. బంధు మిత్రులకు జమ్మి బంగారం అందజేస్తూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ వేళ శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా పరస్పరం ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పల్లెల్లో ఐకమత్య, ఆప్యాయతలు వెల్లివిరిశాయి. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, విజయాలు కలగాలని ఆకాంక్షిస్తూ మండలవ్యాప్తంగా దసరా సంబరాలు అత్యంత వైభవంగా ముగిశాయి.





ఆత్మీయ వాతావరణంలో దసరా సంబురాలు

విజయదశమి వేడుకల్లో వీరేశం కుటుంబ సభ్యులు

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 21) : విజయదశమి పండుగను పురస్కరించుకుని హత్నూర మండల పరిధిలోని సాదులనగర్ గ్రామంలో వనరి గారి వీరేశం కుటుంబ సభ్యులు ఆత్మీయ వాతావరణంలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాదులనగర్ గ్రామపంచాయతీ మాజీ సభ్యులు వనరి వీరేశం మాట్లాడుతూ.. ప్రతి ఏటా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులందరి మధ్య ఇలా ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనరి కుటుంబ సభ్యులు ప్రభు, నర్సింలు, అనిల్, శ్రీకాంత్, నవీన్, రాఘవేందర్, సునీల్, మహేష్‌తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా వనరిగారి శిరీష పుట్టినరోజు వేడుకలు

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 21) : హత్నూర మండల పరిధిలోని సాదులనగర్ గ్రామానికి చెందిన వనరి గారి శిరీష పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యుల సమక్షంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కేక్ కట్ చేయించి శిరీషకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యులందరి మధ్య ఇలా ఆనందోత్సాహాలతో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నరి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.



నా సైజ్..
నా గర్వం..

తన శరీరాకృతిపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతూ బాడీ షేమింగ్‌కు పాల్పడుతున్న ట్రోలర్స్‌కు నటి పాయల్ రాజ్‌పుత్ గట్టిగా బుద్ధి చెప్పారు. "నా బాడీ.. నా సైజ్.. నా గర్వం" అంటూ ఘాటు సమాధానమిచ్చిన ఆమె, తన శరీరం ఎవరికో నచ్చేలా ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మహిళల వ్యక్తిగత హద్దులను గౌరవించాలని, సినీ తారలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ట్రోలర్స్‌కు దీటుగా బదులిచ్చిన పాయల్ వ్యాఖ్యలకు నెటిజన్లు, సినీ వర్గాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.